అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు పాటించాలి

-జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి : అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడారు. ఎలక్షన్ కమిషన్ అఫ్ ఇండియా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయడంతో ఎన్నికల నిబంధనలు అమల్లోకి వచ్చాయని అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను తప్పకుండా పాటిస్తూ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో వివిధ అనుమతులకు సంబంధించి సువిధ అప్‌లో అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. పోస్టర్లు, పాంప్లెంట్లను ముద్రించేటప్పుడు వాటిపైన ప్రింటర్స్ అడ్రస్ కూడా ఖచ్చితంగా ఉండాలన్నారు. ఎన్నికల ప్రక్రియపై నిఘా ఉంచే ందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీ విజిల్ 1950 టోల్ ఫ్రీ నెంబర్ నేషనల్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ వింగ్, ఎంసీఎంసీ తదితర వింగ్స్ ఉంటాయని తెలిపారు. ఈ సారి 85 యేండ్లు నిండిన వారికి హోమ్ ఓటింగ్ అవకాశం ఉంటుందన్నారు. ఈవీఎంలు, పోలింగ్ పర్సన్స్ ర్యాండమేజేషన్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎం.డి.ఇమామ్(అత్తు), మోహన్‌లాల్, శ్రీనివాస్‌రెడ్డి, గయాజుద్దీన్, మునీర్, రవి కుమార్, ప్రశాంత్, డిటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డిడిలు చెల్లించిన గొల్లకుర్మలకు గొర్రెలను పంపిణీ చేయాలి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గొల్లకుర్మలు

నంగునూర్, మార్చి 18, ప్రభాతవార్త : గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో తాము డీడీ డబ్బులు చెల్లించామని తమకు గొర్రెల యూనిట్లను అందించాలని కోరుతూ సోమవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరికి మండల పరిధిలోని అక్కెనపల్లి మదిర అరెపల్లి గ్రామ గొల్లకుర్మలు వినతి పత్రం అందజేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా తాము 22 యూనిట్లకు గానూ ఒక్కో యూనిట్‌కు రూ.43,750 చొప్పున మొత్తం 9,62,500 జిల్లా కలెక్టర్ పేరిట డీడీ తీయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు గొర్రెల యూనిట్లను అందించాలని కోరారు. లేదంటే తాము చెల్లించిన మొత్తం డీడీ డబ్బులను తిరిగి ఇవ్వాలన్నారు. గొర్రెల పంపిణీ విషయమై సమీక్ష సమావేశం జరిగిందని జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న గొర్రెల యూనిట్ల పంపిణీ సమస్య త్వరలోనే పరిష్కరం అవుతుందని కలెక్టర్ మను చౌదరి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గొల్లకుర్మ సంఘం నాయకులు యాదగిరి, అయిలయ్య, రామకృష్ణ,నాగరాజు, నర్సింలు, శ్రీను, మహేందర్, అరవింద్, నరేష్, రేణుక, కళవ్వ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని... యువకుడి ఆత్మహత్య

చేర్యాల (మద్దూరు),మార్చి 18, ప్రభాతవార్త

తల్లిదండ్రులు మందలించారని ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కూటిగల్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం దూల్మిట్ట మండలం కూటిగల్ గ్రామానికి చెందిన తిగుళ్ళ రమేష్ (22)ను తల్లిదండ్రులు మందలించడంతో శనివారం వారి వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగడంతో గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు తెలపడంతో వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్న క్రమంలో సోమవారం మృతి చెందాడు. మృతుడికి తల్లిదండ్రులతో పాటు ఒక అన్న, చెల్లి ఉన్నారు. విషయం తెలుసుకున్న మద్దూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

-ఏప్రిల్ 15 వరకు ఓటు హక్కు నమోదుపై విస్తృత ప్రచారం కల్పించాలి

-సీ విజిల్ యాప్ ద్వారా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయవచ్చు

-ఎన్నికల కోడ్ ఉల్లంఘనల ఫిర్యాదుల కోసం 24 గంటలు 1950 టోల్ ఫ్రీ నెంబర్

-జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ, మార్చి18 ప్రభాతవార్త: భారత ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల ప్రకారం సాధారణ పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పీ బాలస్వామితో కలిసి జిల్లాలో ఎన్నికల నిర్వహణపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేసిందని, ఎన్నికలకు సంబంధించిన నోటీఫికేషన్ ఏప్రిల్ 18న వస్తుందని, ఏప్రిల్ 18 నుండి ఏప్రిల్ 25 వరకు నామినేషన్ల స్వీకరణ, ఏప్రిల్ 26న నామినేషన్ల స్క్రూటినీ, ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉప సంహరణ గడువు ఉంటుందని, మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ జరుగుతుందని వివరించారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని సిద్దిపేట, మెదక్, నర్సాపూర్, సంగారెడ్డి, పటాన్‌చెరు. దుబ్బాక, గజ్వేల్ 7 అసెంబ్లీ సెగ్మెంట్స్‌లో ఓటరు జాబితా సవరణ తుది ఓటరు జాబితా ప్రకారం 18 లక్షల 12 వేల 858 మంది ఓటర్లు ఉన్నారని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు సరిచూసుకోవాలన్నారు. జాబితాలో పేరు లేని వారు ఏప్రిల్ 15 వరకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన మేర పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, అవసరమైన మేర బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లు అందుబాటు ఉన్నాయని, ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్ పూర్తయిందన్నారు. ఎన్నికల కమీషన్ సాధారణ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుండి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి వర్తిస్తుందని, మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, బెదిరింపులకు పాల్పడటం, తప్పుడు ప్రచారాలు చేయడంపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరిచేందుకు జిల్లాలో ఎంసీసీ, సర్వేలెన్స్ బంధాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృంధాలను, వీడియో సర్వేలెన్స్ బృందాలను, ఎంసీఎంసీ కమిటీ, ఇతర కమిటీలను ఏర్పాటు చేశామని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ఫిర్యాదులను ప్రజలు 1950 టోల్ ఫ్రీ నెంబర్, సీ విజిల్ యాప్ ద్వారా చేయవచ్చని అన్నారు. సీ విజిల్ యాప్‌లో లైవ్ వీడియో అప్‌లోడ్ చేసిన 100 నిమిషాల గడువులోపు అధికారులు క్షేత్రస్థాయిలో చేరుకొని ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే ప్రజా ప్రతినిధ్య చట్టం 1951 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని, వీటిని పరిగణలోకి తీసుకొని సజావుగా ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎస్పీ బాలస్వామి మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం తెలంగాణ నాలుగో విడతలో పోలింగ్ జరుగుతుందని, అక్రమ నగదు, లిక్కర్ సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో అవసరమైన మేర చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, 24 గంటల పాటు గట్టి నిఘా ఉంచామని తెలిపారు. ఎన్నికల దృష్ట్యా ప్రజలు ఆధారాలు లేకుండా 50 వేలకు మించి నగదుతో ప్రయాణించవద్దని, ప్రతి రోజు తనిఖీలలో జప్తు చేసిన సొమ్మును జిల్లాలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామని, ఆధారాలు సమర్పించి గ్రీవెన్స్ కమిటీ నగదు విడుదల చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మొదటి రోజు పది పరీక్షలు ప్రశాంతం

-పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్స్ వస్తువులు నిషేధం

-10 పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పి

-టెన్త్ పరీక్షలలో ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా కట్టుదిట్టంగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ మను చౌదరి

సంగారెడ్డిలో 10వ తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, జిల్లా ఎస్పిలు

టెన్త్ పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి

సంగారెడ్డి టౌన్, మార్చి 18, ప్రభాతవార్త: జిల్లా వ్యాప్తంగా ఆయా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రయివేటు పాఠశాలల్లో 10వ తరగతిలో విద్యను ఆందుకున్న విద్యార్థులు సోమవారం నుంచి ఆరంభం అయిన 10 వార్షిక పరీక్షలకు హాజరై పరీక్షలు రాశారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ బాలికల, సెయింట్ ఆర్నెల్డ్ పాఠశాలల్లో కొనసాగుతున్న పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, జిల్లా ఎస్పి సిహెచ్ రూపేష్ చెన్నూరిలు పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు కల్పించిన సౌకార్యాలను (తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మెడికల్ సేవలు తదితర) కలెక్టర్, ఎస్పిలు పరిశీలించారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా తగు సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలకు 10 విద్యార్థులు ఆర్టీసి బస్సుల్లో పరీక్ష కేంద్రం వరకు ఉచితంగా ప్రయాణించ వచ్చని సూచించారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్షా కేంద్రాలకు సమీపంలోని జిరాక్సు సెంటర్‌ను మూసి ఉండేలా ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా ఎస్పి రూపేష్ చెన్నూరి వివరించారు. పరీక్ష కేంద్రాల్లోని విద్యార్థులతో పాటు ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్‌లు ఎవరూ ఎలక్ట్రానిక్స్ పరికరాలు తీసుకుపోయేందుకు అనుమతి లేదని హెచ్చరించారు. పరీక్ష కేంద్రాల వద్ద అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకుంటే 100కు డయల్ చేయాలని, లేదా పోలీసు ఠాణాకు సమాచారం అందించాలని సూచించారు.

సిద్దిపేట జిల్లాలో

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి : టెన్త్ పరీక్షలలో ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లను అదేశించారు. టెన్త్ పరీక్షల్లో భాగంగా మొదటి రోజు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వం హైస్కూల్, ఇందిరా నగర్ జడ్పీ పాఠశాలలో పరీక్ష కేంద్రాలను అయన సోమవారం అకస్మికంగా పరిశీలించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల సమీపంలో ప్రజలు గుమికాకుండా చూసుకోవాలని ఎలాంటి సమస్య వచ్చి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. ప్రశ్న పత్రాలు,జవాబు పత్రాల రవాణా పోలీసు ఎస్కార్ట్‌తో నిర్వహించాలన్నారు. తాగునీరు, మరుదొడ్ల సౌకర్యం ఖచ్చితంగా ఉండాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా విద్యార్థులకు అందుబాటులో ఓఆర్ఎస్‌తో పాటు అవసరమైన మందులతో వైద్య శిబిరం తప్పకుండా అందుబాటులో ఉంచాలన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు

జిల్లాలో పదో తరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ప్రారంభమైనాయి. 5 నిమిషాల అలస్యం నిబంధన ఉండడంతో విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే చేరుకున్నారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యాశాఖ, రెవెన్యూ, పోలీసు అధికారులు తగు ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. 13988 విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 11 మంది విద్యార్థులు హాజరు కాకపోవడంతో 13977 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.

ఎంపిడిఓకు ఎంపిపి క్షమాపణ చెప్పాలి

ములుగు ఎంపిడిఓ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న అధికారులు

ములుగు, మార్చి 18 (ప్రభాతవార్త): ఎంపిఓపై ఎంపిపి దాడి చేయడం బాధాకరమని, వెంటనే ఎంపిఓకు క్షమాపణ చెప్పాలని ములుగు ఎంపిడిఓ వెంకటరామకృష్ణశర్మ అన్నారు. సోమవారం ములుగు ఎంపిడిఓ కార్యాలయం వద్ద అధికారులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ వెంకటరామకృష్ణశర్మ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలో ఎంపిఓపై ఎంపిపి దాడి చేయడం సరైంది కాదన్నారు. వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిడిఓల అధికారులు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సూపరింటెండెంట్ రామచంద్రారావు, సీనియర్ అసిస్టెంట్ నర్సింలు,జూనియర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

20న కొమురవెల్లిలో ధర్మ సభ

కొమురవెల్లి, మార్చి 18, ప్రభాతవార్త : సనాతన హిందూ ధర్మ జాగృతి శ్రీ జగద్గురు రేణుకాచార్య జయంతి సందర్భంగా చేపట్టిన శ్రీ అది జగద్గురు రేణుకాచార్య మహాపాదయాత్ర ఈనెల 20న కొమురవెల్లి మల్లన్న సన్నిధికి చేరుకుటుందని లింగాయత్ సమాజం కొమురవెల్లి మండల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు మహాదేవుని శ్రీనివాస్ సోమవారం తెలిపారు. 20న మధ్యాహ్నం 12 గంటలకు టిడిపి కళ్యాణ మండపం కొమురవెల్లిలో శ్రీశ్రీశ్రీ సద్గురు మహాదేవ్ స్వామిజీ అధ్యక్షతన ధర్మ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. పాదయాత్రలో పాల్గొన్న వారికి వీరశైవ అర్చక సంఘం కొమురవెల్లి వారిచే అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి మాజీ ఎంపి సురేష్ షెట్కార్, మాజీ ఎమ్మెల్యే, జనగామ డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, లింగాయత్ సమాజ రాష్ట్ర నాయకులు నరుకుల్ల శివప్ప,మల్లికార్జున స్వామి దేవాలయ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డిలు హాజరవుతారని వివరించారు. మహాపాదయాత్ర యాదాద్రి జిల్లా అలేరు మండలం కొలనుపాకుకు చేరుకుంటుందన్నారు.

రైస్ మిల్లులో డిఎస్‌వో, విజిలెన్స్ తనిఖీలు

హుస్నాబాద్,మార్చి17,ప్రభాతవార్త హుస్నాబాద్ మండలంలోని పందిల్ల గ్రామంలో గల పవనసుథ పారా బాయిల్డ్ రైస్‌మిల్‌లో సోమవారం మధ్యాహ్నం డిఎస్‌వో అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఇదే మిల్లులో ప్రభుత్వం ద్వార కొనుగోలు కొనుగోలు చేసిన ధాన్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అప్పగించకుండా 200ల టన్నుల బియ్యాన్ని మిల్లు యాజమాన్యం పక్కదోవ పట్టించి ప్రభుత్వానికి అందిచకుండా మోసం చేశారని హుస్నాబాద్‌కు చెందిన కిసాన్‌సంఘ్ జిల్లా ఉపాధ్యక్షులు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి మిల్లుపై ఇటీవల జిల్లా కలెక్టర్,డిఎస్‌వొతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలోనే తనిఖీలు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా రాత్రి వరకు జరిగిన తనిఖీలలో విజిలెన్స్ అధికారులు మిల్లు నుండి ప్రభుత్వానికి రావాల్సిన బియ్యం లెక్కలతో పాటు మిల్లులో ఉన్న స్టాకు వర్కింగ్ అవుతున్న బియ్యాన్ని పరిశీలించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా మండల సివిల్ సప్లయ్ అధికారులకు తెలియకుండానే మిల్లులో తనిఖీలు జరగడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. గతంలో సైతం హుస్నాబాద్ పట్టణంలోని ఆరెపల్లి మిల్లులో సివిల్ సప్లయ్ అధికారులు దాడులు నిర్వహించి మిల్లును సీజ్ చేసిన విషయం తెలిసిందే.

సిగరెట్ గొడవ ప్రాణం తీసింది...తాగిన మత్తులో స్నేహితుడి హత్య

కంది, మార్చి 18, ప్రభాతవార్త: తాగిన మత్తులో సిగరేటు కొరకు జరిగిన గొడవలో స్నేహితుడిని భవనంపై నుంచి తోసేసి హత్య చేసిన సంఘటన మండల పరిధిలోని ఇంద్రకరణ గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇంద్రకకరణ్ పోలీసులు, భవనం యజమాని కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఇంద్రకరణ్ గ్రామానికి చెందిన కొత్తపల్లి కిష్టయ్యకు చెందిన ఇంట్లో బీహార్‌కు చెందిన ముగ్గురు స్నేహితులు (అశోక్ కుమార్ యాదవ్, అంకిత్, రోషన్) పెంట్ హౌజ్‌లో అద్దెకు ఉంటూ నవ్య కర్మాగారంలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఆదివారం రాత్రికి ముగ్గురు మధ్యం సేవించగా అంకిత్, రోషన్‌లో సిగరేట్ కొరకు గొడవ పడి క్షణికావేశంలో మద్యం మత్తులో అకింత్ రోషన్‌ను భవనంపై నుంచి తోసేయగా రోషన్ అక్కడికి అక్కడే రక్తం మడుగులో మృతి చెందడన్నారు. రాత్రికి రోషన్ మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన నిందితుడి అరెస్టు

-రెండున్నర తులాల బంగారు, బైక్, ఫోన్ స్వాధీనం

విలేకరులకు వివరాలను వెల్లడిస్తున్న సీఐ

దుబ్బాక, మార్చి 18, ప్రభాతవార్త : నూతన టెక్నాలజీ, సీసీ కెమెరాల ద్వారా చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన నిందితున్ని చాకచక్యంగా వ్యవహరించి అరెస్టు చేసినట్లు దుబ్బాక సీఐ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ గ్రామానికి చెందిన మ్యాన లావణకుమార్(34) భూంపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని ఎనగుర్తి గ్రామ శివారులో ఎల్లమ్మ గుడి వద్ద కల్లు అమ్ముకుంటున్న కోయాడ యాదమ్మ మెడలోంచి బంగారు పుస్తెలతాడును దొంగిలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని సీపీ డా॥అనురాధ, సిద్దిపేట ఏసీపీ మధు పర్యవేక్షణలో నిందితున్ని పట్టుకోవడానికి ప్రత్యేక బృందం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిందితుడు అన్‌లైన్‌లో లోన్ అప్స్ ద్వారా డబ్బులు తీసుకొని వాటిని కట్టడం ఇబ్బందిగా మారడంతో చైన్ స్నాచింగ్ పాల్పడినట్లు తెలిపారు. అదివారం సాయంత్రం నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారించగా చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు అంగీకరించినట్లు తెలిపారు. నిందితుని నుంచి రెండున్నర తులాల పుస్తెలతాడు బైక్, ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. చైన్ స్నాచింగ్ కేసును చేధించిన దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గంగరాజు, మిరుదొడ్డి ఎస్ఐ పరశురాం, క్రైమ్ పార్టీ సిబ్బంది సాయికృష్ణ, రాజిరెడ్డి, రాంజీలకు త్వరలోనే సీపీ చేతుల మీదుగా రివార్డు అందించడం జరుగుతుందన్నారు.

నేలబారిన జొన్న..రాలిపోయిన మామిడి

-అయోమయంలో అన్నదాతలు...ఆదుకోవాలని వేడుకోలు

ముంగి శివారులో నేలబారిన జొన్న పంట దృశ్యం

హద్నూర్ శివారులో రాలిపోయిన మామిడి కాయలు

న్యాల్‌కల్, మార్చి 18, ప్రభాతవార్త: ఆదివారం మధ్యాహ్నం మండలంలోని ఆయా గ్రామాల్లో ఈదురు గాలులు, ఉరుముల మెరుపులతో కురిసిన భారీ వర్షానికి రైతన్నలు రోదపడాల్సి వచ్చింది. ఏకదాటిగా ఉరుములు, మురుపులు, ఈదురు గాలులతో కురిసిన వర్షానికి పాత ఇండ్లు కూలిపోగా, రేకులు ఎగిరిపోయి ఇంటి వాసులకు నివాసయోగంగా లేకుండా పోయింది. రైతులు వందల ఎకరాల్లోసాగు చేస్తున్న జొన్న పంట పూర్తిగా నేలబారింది. వేలాది మామడి చెట్లకు కాసిన మామిడి కాయలు అధిక శాతం నేలరాలాయి.

అకాల వర్షాలతో రైతులు పరిస్థితి దయ నీయంగా మారిందని చెప్పడం అతిశయోక్తి కాదు. మండల వ్యవసాయ అదికా రులు గ్రామాల్లో అకాల వర్షాలకు నష్టపోయిన వివరాలు సేకరించి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు వినతి చేస్తున్నారు.

అనాజిపూర్‌లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

అనాజిపూర్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న దృశ్యం

రాయపోల్,మార్చి18 ప్రభాతవార్త : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కేంద్ర బలగాలు,సిఐఎస్ఎఫ్‌తో గజ్వేల్ ఏసిపి పురుషోత్తంరెడ్డి,తొగుట సిఐ లతీఫ్ ,రాయపోల్ ఎస్ఐ రఘుపతి లు పోలీస్ సిబ్బందితో కలిసి రాయపోల్ మండల పరిధిలోని అనాజిపూర్‌గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్ ఏసిపి మాట్లాడుతూ..పోలీస్ కమిషనర్ మేడం ఆదేశానుసారం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ గురించి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లుతెలిపారు. పార్లమెంట్ ఎన్నికలు ఇన్సిడెంట్ ఫ్రీ ఎన్నికల నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఓటుహక్కు ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధం, ఓటు హక్కుఉన్న ప్రతి ఒక్కరూ దానిని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ద్వారా ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలో ఓటు యొక్క ప్రాధాన్యత చాలా గొప్పదని, ఓటు హక్కును ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా మీకు నచ్చిన వారికి ఓటు వేసే ప్రశాంతమైన వాతావరణం కల్పిస్తామని అన్నారు.

స్పీకర్‌ను సన్మానించిన కాంగ్రెస్ నేత ముప్పిడి గోపాల్

కంటోన్మెంట్, మార్చి 18 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ ముప్పిడి గోపాల్ అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత రత్న రవికుమార్, కాంగ్రెస్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, హన్మంత్ రావ్, సాయికుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నల్ల పోచమ్మ దేవి వార్షికోత్సవం

వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న బండి రమేష్

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 18, ప్రభాతవార్త: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కూకట్‌పల్లి డివిజన్ సంగీత్‌నగర్‌లోని శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ దేవి ఆలయం 25వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వ రరావు, సత్యం శ్రీరంగం, తూము వేణు, శేరి సతీష్‌రెడ్డి, కొమ్మ సత్తయ్య, మేకల రమేస్, గోవింద్‌గౌడ్, డి.యాద గిరి, కృష్ణ రాజ్‌పుత్, కె.సురరేష్, కె.సత్యనారాయణ, కూకట్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు కృష్ణ వేణి, పుష్పారెడ్డి, రమాదేవి, జ్యోతి, అనిత, రజిత దిలీప్, భారతమ్మ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికల్లో మాదిగలకు టికెట్లు కెటాయించాలి : ఇటుక శ్రీ కిషన్

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేత ఇటుక శ్రీ కిషన్ మాదిగ

కంటోన్మెంట్,మార్చి 18 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ప్రధాన పార్టీలు మాదిగలకు టికెట్ కెటాయించాలని కంటోన్మెంట్ ఎమ్మార్పీఎస్ ఇన్‌ఛార్జి ఇటుక శ్రీ కిషన్ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం బోయిన్‌పల్లి డైమాండ్ పాయింట్ వద్ద విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ షెడూ ల్డ్ కులాల జనాభలో 60 శాతం మాదిగలు ఉన ్నప్పటికి 50 సంవత ్సరాల చరిత్రలో ఏనాడు మాదిగ సామాజిక వర్గానికి టికెట్లు ఇవ్వలేదని అవేదన వ్యక్తం చేశారు. ఈ ఉప ఎన్నికల్లో ప్రతి రాజకీయ పార్టీలు మాదిగలకు టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు అజిత్ కళ్యాణ్, ఇటుక గోపి మాదిగ, రొట్లె సునీల్ మాదిగ, శ్రీకాంత్ మాదిగ, మురళీ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

కునారిల్లుతున్న స్త్రీల జీవితం

కవయిత్రి, రచయిత్రి జూపాక సుభద్ర

జూపాక సుభద్రతో శివారెడ్డి, చెన్నయ్య తదితర అతిథులు

నాంపల్లి, మార్చి 18 ప్రభాతవార్త : సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా అట్టడుగున కునారిల్లుతున్న స్త్రీల జీవితాన్ని గురించి తాను చదివిన పుస్తకాల్లో ఎక్కడా లేకపోవడమే తనను కవయిత్రి, రచయిత్రిగా చేసిందని ప్రముఖ కవయిత్రి, రచయిత్రి జూపాక సుభద్ర అన్నారు. బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో పరిషత్తు నిర్వహిస్తున్న నేను నా రచనలు కార్యక్రమంలో సోమవారం ఆమె ప్రసంగిస్తూ తల్లిదండ్రులకు 11వ సంతానంగా చదువుకోవడానికి వీలులేని దుస్థితిని ఎదురొడ్డి బాల్యవివాహాన్ని తప్పించుకొని సాంఘిక సంక్షేమశాఖ హాస్టళ్లల్లో చేరి అడుగడుగునా ఎదురైన ఎన్నో అవాంతరాలను అధిగమించి అస్తిత్వవాద సాహిత్య అధ్యయనంతో ముందుకు నడిచానన్నారు.

శారీరక మానసికోల్లాసానికి నృత్యం ఉపకరిస్తుంది

మాజీ కేంద్రమంత్రి డా. ఎస్.వేణుగోపాలాచారి

నృత్యనీరాజనం కావించి చిన్నారి కళాకారులతో వేణుగోపాలాచారి

నాంపల్లి, మార్చి 18 ప్రభాతవార్త : ప్రతీ ఒక్కరిలో శారీరక, మానసిక ఉల్లాసానికి ఎదుగుదలకు నాట్యం ఎంతగానో ఉపకరిస్తుందన్న కేంద్ర మాజీమంత్రి డా. సముద్రాల వేణుగోపాలాచారి వారిలో నిగుఢీకృతంగా ఉండే ప్రతిభాపాటవాలను వెలికితీసి సానబట్టి ప్రోత్సహిస్తే వారు అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో దేవదేవుడికి సంగీత, నృత్యనీరాజనం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వేణుగోపాలాచారి సభాధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, ఆత్మీయ అతిథులు పండిట్ అంజుబాబు, మహ్మద్ షరీఫ్, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి గొల్లకృష్ణ తదితరులతో కలిసి డా. పేరిందేవి నేతృత్వంలో నృత్యప్రదర్శనల్లో పాల్గొన్న 40మంది చిన్నారి కళాకారులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపారు.

సమస్యలపై వినతి

వినతి పత్రం అందుకుంటున్న డిసి శ్రీనివాస్ రెడ్డి

అల్వాల్, మార్చి 18 ప్రభాతవార్త : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణి వేదికగా ప్రజలు డిసి శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రాలు అందించారు. సాయిసూర్య, లోటస్ పాండ్, రాయల్ ఎన్‌క్లేవ్ కాలనీలకు చెందిన ప్రతినిధులు డిసిని కలిసిన వారిలో ఉన్నారు. పారిశుధ్యం సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. కార్మికులు తమ ప్రాంతాలులోకి రావడం లేదని తద్వారా ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. దోమలు, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు సమస్యలు ఉన్నాయని చెప్పారు. సమస్యలు అన్నింటికి త్వరలోనే పరిష్కరం లభిస్తుందని డిసి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు రమేష్ యాదవ్, సతీష్, శ్రీనివాస్ రావు, రాజు గౌడ్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త చెరువు, జొన్నబండ ఆక్రమణలను ఆపండి

అల్వాల్, మార్చి 18 ప్రభాతవార్త: అల్వాల్ కొత్త చెరువు, జోన్నబండ క్వారీ కబ్జాలను తక్షణం అరికట్టాలని పట్టణ కాంగ్రెస్ పార్టీ నేతలు తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. పార్టీ సీనియర్ నేత చిట్టిబాబు నేతృత్వంలోని బృందం తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందించారు. 25 ఎకరాలు విస్తీర్ణం ఉండాల్సి చెరువు ఇప్పటికే అత్యధిక బాగం కబ్జాకు గురైందని వివరించారు. తాత్కాలిక నిర్మాణాలతో మొదలై శాస్వత భవనాలు వసఉన్నాయని తెలిపారు. చెరువు ఉనికి ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జొన్నబండ క్వారీది ఇదే పరిస్థితి అని పేర్కొన్నారు. క్వారీని మట్టితో నింపేస్తున్నారని పేర్కొన్నారు. తక్షణం రెవెన్యూ యంత్రాంగం స్పందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు చిట్టిబాబు, అశోక్ రెడ్డి ఇతర నేతలు పాల్గొన్నారు.

నిరుపేదల పక్షాన అలుపెరుగని పోరాటయోధులు స్వర్గీయ వై. పెంచల్‌రెడ్డి

మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ తంగ లక్ష్మారెడ్డి

స్వర్గీయ వై. పెంచల్‌రెడ్డికి నివాళులు అర్పిసున్తన్న కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ తంగ లక్ష్మారెడ్డి,బస్తీవాసులు

కుత్బుల్లాపూర్, మార్చి 18 ప్రభాతవార్త: నిరుపేదలకు నిలువనీడ నిచ్చేందుకు తన ప్రాణాలు ఫణంగా పెట్టిన స్వర్గీయ పెంచల్‌రెడ్డి చిరస్మర నీయులని కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ తంగ లక్ష్మారెడ్డి కొనియాడారు. స్వర్గీయ వై.పెంచల్ రెడ్డి27వ వర్ధంతిసభ చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో భారీ జనసందోహం మధ్య సోమవారం నిర్వహించారు . ఈసందర్భంగా కళాకారులు నిశానీ చెందర్ ఆధ్వర్యంలో స్వర్గీయ పెంచల్‌రెడ్డి మృతికి గుర్తుగా పాటలుపాడి ఆయన సృతులను గుర్తుచేశారు. కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ తంగ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పేదల పక్షాననిలిచి ఈరోజు వందలాది మందికి కొత గూడు కల్పించేదిశగా నిరంతరం పోరాడిన యోధుడు స్వర్గీయ పెంచల్‌రెడ్డి అన్నారు. స్వర్గీయ పెంచల్‌రెడ్డి కుమారుడు జనార్ధన్‌రెడ్డి, కుమార్తె రమాదేవిల ఆధ్వర్యంలో తండ్రి విగ్రహంవద్ద స్థానిక పెద్దఎత్తున నినాదాల మధ్య నివాళులు అర్పించారు.కార్యక్రమంలో భగత్‌సింగ్‌నగర్ సంక్షేమసంఘ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సత్యం, అంబేద్కర్ సంఘ అధ్యక్షులు జెల్లా వెంకటేశ్, చంద్రానగర్ సంక్షేమ సంఘ నాయకులు దేగల కృష్ణమూర్తి, బస్తీ వ్యవస్థాపకులు సి.హెచ్.రమేశ్, ఎ.రాజిరెడ్డి, బీసు వెంకటేశ్‌గౌడ్, ఇ.సామ్రాట్, జి. వరదరాజు, కె.శ్యామల, నాయకులు జిత్తేందర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, హరికుమార్, సత్తిరెడ్డి, భూపాల్‌రావు పంతులు భగత్‌సింగ్‌నగర్ ప్రజలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొని స్వర్గీయ పెంచల్‌రెడ్డి అమర్‌హై అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

మాకు న్యాయం చేయాలి

సైఫాబాద్, మార్చి 18 ప్రభాతవార్త: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కోర్టులో ఆఫీస్ సబార్డినేట్ (అటెండర్) పోస్టులు దరఖాస్తు చేసుకుని ఎంతోకష్టపడి చదవి పరీక్షలలో అర్హత సాధించినప్పటికి తమకు ఉద్యోగాలు ఇవ్వలేదని బాధితులు అనురాధ, వనజ, మౌనిక, రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక న్యాయవ్యవస్థలో ఇంతగా అన్యాయం జరిగితే ఇక సామాన్య ప్రజలకు కోర్టులలో ఏం న్యాయం జరుగుతుందని వారు ప్రశ్నించారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమకు జరిగిన అన్యాయంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని వారు సిఎం రేవంత్‌రెడ్డిని కోరారు. మొత్తం 92 పోస్టులకు 81 మందిని అధికారులు ఎంపిక చేయడం జరిగిందని దీంతో తాము ఎంతో సంతోషపడ్డామని అన్ని వివరాలతో మల్కాజ్‌గిరి కోర్టుకు వెళ్ళామని ఇందులో 63 మందికి మాత్రమే అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చిన విధంగా వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేశారని వారన్నరు. మిగిలిన 18 మందికి ఉద్యోగాలు ఇవ్వలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

బిఆర్ఎస్ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలి

లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకట రాజేశ్వర్‌రావు

సైఫాబాద్, మార్చి 18 ప్రభాతవార్త: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బిజెపి పార్టీలకు ఓటర్లు తగిన బుద్ధి చెప్పాలని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకట రాజేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. తమ పార్టీ బిఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించిన నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బిఆర్ఎస్ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన పలు నియోజక వర్గాలకు ఇన్‌చార్జిలను నియమించి మాట్లాడారు.

చిన్నారి కాలేయ మార్పిడికి ఆర్థిక సహాయం



కాలేయ మార్పిడికి చిన్నారి తండ్రికి ఆర్థిక సహాయం అందజేస్తున్న బిజెపి నేత బి.పవన్‌రెడ్డి, ఆయన సతీమణి హారణి

హైదరాబాద్, మార్చి 18 ప్రభాతవార్త: చిన్నారి కాలేయ మార్పిడికి బిజెపి సీనియర్ నేత బి.పవన్‌రెడ్డి, హారణి దంపతులు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారు. నల్గొండ జిల్లా, మిర్యాలగూడకు చెందిన భరత్‌కుమార్ నగరంలోని పద్మారావునగర్‌లో నివాసం ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అతని ముదున్నరేళ్ల కుమార్తె బండారు సీతాన్విత కు కాలేయ వ్యాధికి గురికావడంతో ఆ చిన్నారికి కాలేయ మార్పిడి శస్త్రచికిత్స రెయిన్‌బో చిల్డ్రన్ ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ కాలేయ మార్పిడి శస్త్రచికిత్సకు రూ.22 లక్షలు ఖర్చు కావడంతో సమాచారం తెలుసుకున్న పవన్‌రెడ్డి సోమవారం బర్కత్‌పురలోని తన కార్యాలయానికి చిన్నారి తండ్రి భరత్‌కుమార్‌ను పిలిపించుకొని లక్ష రూపాయల చెక్కు అందజేశారు. అంతే కాకుండా ఆ చిన్నారి పూర్తిగా కోలుకున్న తర్వాత పదవ తరగతి వరకు తానే ఉచితంగా చదివిస్తానని హామి ఇచ్చి గొప్ప మనసును చాటుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారి తండ్రి భరత్‌కుమార్, పవన్‌కుమార్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, పవన్‌రెడ్డి దంపతులు కొన్ని నెలల క్రితమే సీనియర్ జర్నలిస్టు దత్తాత్రి మృతితో అనాథైన ఆయన కుమార్తె ఉన్నత చదువులకు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేసి మానవత దృక్పథాన్ని చాటారు.

చల్లా వంశీచంద్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన కన్‌జ్యూమర్ రైట్స్‌ప్రొటక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి

గెలిపించేందుకు కృషి చేస్తా

యూసుఫ్‌గూడ, మార్చి 18, ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో రోజురోజుకు దృఢత్వం పెరుగుతుందని కన్‌జ్యూమర్ రైట్స్ ప్రొటక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి అన్నారు. ఈసందర్భంగా సోమవారం మహబూబ్‌నగర్ పార్లమెంటరీ అభ్యర్థి చెల్లా వంశీచంద్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా జూబ్లిహిల్స్‌లోని కొడంగల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ వేనుముల తిరుపతి రెడ్డి నివాసంలో కలిసి అభినందించారు.రాబోయే రోజుల్లో వంశీచంద్ రెడ్డి అత్యధిక మెజారిటీతో విజయం సాధించేందుకు తమ వంతు కృషిచేస్తామని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిట్లపల్లి వెంకటామిరెడ్డి, అంగడ్రాయచూర్ రామ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ రన్నర్స్ వినూత్న కార్యక్రమం

సినిమా, డాక్యుమెంటరీల ప్రదర్శన

హైదరాబాద్, మార్చి 18,ప్రభాతవార్త: ఎన్ఎండిసి హైదరాబాద్ మారథాన్ 2024 ప్రమోషన్‌లో భాగంగా హైదరాబాద్ రన్నర్స్ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించింది. బంజారాహిల్స్‌లోని ప్రసాద్ లాబ్స్‌లో నిర్వహించిన ఈకార్యక్రమంలో 'లా అల్ట్రా: దిహై" అనే ప్రత్యేక సినిమా, డాక్యుమెంటరీ "మూవింగ్ మౌంటెన్స్"ను ప్రదర్శించారు. అల్ట్రా రన్నింగ్‌లో ఉండే సవాళ్లు, విజయాల గురించి, పాల్గొనేవారికి అవగాహన కల్పించడానికి ఈకార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రేక్షకులతో పూర్తిగా నిండిన ఈప్రదర్శన అత్యధిక స్థాయి ఓర్పు ఎలా ఉంటుందో చూపించింది. కఠినమైన భూభాగాలు, వాతావరణాలను జయించడానికి అసవరమైన స్థితిస్తాపకత, సంకల్ప బలాలను ప్రదర్శించింది. ఈసందర్భంగా రేస్ డైరెక్టర్ డాక్టర్ రజత్ చౌహాన్, దర్శకుడు బాలరాజశేఖర్ తో కలిసి చర్చా కార్యక్రమం నిర్వహించారు.

గాయపడిన వృద్ధురాలిని ఆస్పత్రికి తరలించిన

లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులు

బేగంపేట మార్చి 18ప్రభాతవార్త: తిరుమల గిరి టీచర్స్ కాలనీ సమీపంలో రోడ్డు పక్కనే నివాసం ఉంటున్న వృద్ధురాలు తీవ్రంగా గాయపడి ఇబ్బంది పడుతున్న దృశ్యాన్ని వాకింగ్ చేస్తున్న హైదరాబాద్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులు బి.సురేష్ కుమార్ గమనించారు.ఈ విషయాన్ని వెంటనే హైదరాబాద్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ,సీనియర్ జడ్జి సిటీ సివిల్ కోర్టు జి.కళార్చన దృష్టికి తీసికెళ్లారు.ఆమె సూచన మేరకు వెంటనే 108కు సమాచారం ఇచ్చారు.ప్రాథమిక చికిత్స అనంతరం గాయపడిన వృద్ధురాలు లలిత (68)ను మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు.ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్‌కు హైదరాబాద్ లీగల్ సర్వీసెస్ అథారిటీ అన్ని వేళల అండగా ఉంటుందన్నారు.కన్న తల్లి దండ్రులను వారి కుటుంబసభ్యులు ఎట్టి పరిస్థితిల్లో ఇబ్బందులకు గురిచేయవద్దని,రోడ్లపై వదిలి వేయవద్దని,వారిని గౌరవించాలని సూచించారు.సీనియర్ సిటిజన్స్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా హైదరాబాద్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీని సంప్రదించాలని వారికి తగిన న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

మూడేళ్ల చిన్నారిపై బాలుడి అత్యాచారం?

బాలుడి అరెస్టు

ఎల్.బి.నగర్, మార్చి 18 ప్రభాతవార్త: అభం శుభం తెలియని మూడేళ్ల చిన్నారిపై 13ఏళ్ల బాలుడు అత్యాచారం చేశాడు. ఈ సంఘటన సరూర్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ కాలనీలో పక్కపక్క పోర్షన్లలో రెండు కుటుంబాలు అద్దెకు ఉంటున్నాయి. ఆదివారం సాయంత్రం ఓ కుటుంబానికి చెందిన 3సంవత్సరాల చిన్నారి దాబాపై ఆడుకుంటోంది. అదే సమయంలో మరో కుటుంబానికి చెందిన 13సంవత్సరాల బాలుడు వెళ్లి చిన్నారిపై అత్యాచారం చేశాడు. బాలికపై అత్యాచారం జరిగినట్లు సమాచారం తెలిసిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టడం జరిగిందని పోలీసులు తెలిపారు. చట్టప్రకారం మైనర్ అయిన దృశ్య కేసు వివరాలు బహిర్గతం చేయలేక పోతున్నామని, పూర్తి స్థాయిలో దర్యాప్తు అనంతరం వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ముషీరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. దోమలగూడ ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 16వ తేదీ రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఉండగా గణేష్ అనే వ్యక్తి 100కు కాల్ చేసి ఒక గుర్తు తెలియని వ్యక్తి ట్యాంక్‌బండ్‌పైనున్న గురజాడ అప్పారావు విగ్రహం వద్ద అపస్మారకస్థితిలో ఉన్నాడని సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న కానిస్టేబుల్ ఉదయ్‌కిరణ్ ట్యాంక్‌బండ్ పైనకి వెళ్లి చూడగా అనారోగ్య కారణంతో ఒక వ్యక్తి అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. వెంటనే స్పందించిన పోలీస్‌సిబ్బంది 108 అంబులెన్స్‌కు కాల్ చేయగా వారు వచ్చి ఆ వ్యక్తి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. చనిపోయిన వ్యక్తికి సుమారు 45 నుండి 50 సంవత్సరాల మధ్య వయసు ఉంటుందని, అక్కడ ఎవరూ కూడా అతని గురించి వివరాలు ఏమీ తెలపకపోవటంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని గాంధీ హాస్పటల్ మార్చురీలో భద్రపరిచామని తెలిపారు.

జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు

రాష్ట్ర డైరీ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

నార్సింగి, మార్చి 18 ప్రభాతవార్త : రాష్ట్ర డైరీ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్, నార్సింగి, మణికొండ, శంషాబాద్ మున్సిపాలిటీలు, రాజేంద్రనగర్ సర్కిల్, శంషాబాద్ మండలాల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఇంటికి వచ్చి షాలువాలతో సత్కరించి, పుష్పగుచ్చాలిచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. సోమవారం నార్సింగి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు క్యాతం అశోక్ యాదవ్, సీనియర్ నాయకులు అశోక్ కుమార్, కిరణ్, రాము తదితరులు, అలాగే మాజీ సర్పంచ్‌లు అశోక్ కుమార్, గండయ్య ముదిరాజ్, సదానంద్, నాయకులు విష్ణు, శ్రీనివాస్, నర్సింగ్ ముదిరాజ్, ఇంద్రారెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణలో దశాబ్ద కాలం తరువాత పేదల పక్షపాతి అయిన కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిందని తెలిపారు. మళ్లీ ఇందిరమ్మ రాజ్యంలో పలే పేదలకు న్యాయం చేసి తీరుతామన్నారు.

ఆరు గ్యారెంటీలను అందించేందుకు కృషి

నూతన అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డికి



రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు పెద్దపులి కిషన్, మాజీ సర్పంచ్ గండయ్య

నార్సింగి, మార్చి 18 ప్రభాతవార్త : రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డికి సోమవారం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పెద్దపులి కిషన్(కృష్ణ), ఖానాపూర్ మాజీ సర్పంచ్ గండయ్య వుదిరాజులు పుష్పగుచ్చాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను అర్హులందరికి అందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేసి, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రణాలిక బద్ధంగా పని చేస్తామన్నారు. పార్టీలోని కొత్త, పాత నాయకులందరిని కలుపుకొని ముందుకెళ్తామన్నారు. నాకు ఈ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలపుతున్నామన్నారు. అనంతరం కిషన్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆదినుంచి పెద్దపీట వేస్తుంది ఒక్క కాంగ్రెస్ పార్టీయేనని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తీసుకు వచ్చిన అనేక సంస్కరణల ఫలితంగానే నేడు దేశం ఇంత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు.

మురకొండ సందీప్‌చౌదరికి బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు

కోమిటిరెడ్డి వెంకటరెడ్డి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న సందీప్ చౌదరి

జీడిమెట్ల, మార్చి 18, ప్రభాతవార్త : విజేత సూపర్ మార్కెట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురకొండ సందీప్ చౌదరి హెచ్ఎంటివి 2023, బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డును సోమవారం కోమిటిరెడ్డి, వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు చేతులమీదుగా అందుకున్నారు. సందీప్ చౌదరి మాట్లాడుతూ మానాన్న జగన్మోహన్‌రావు అడుగుజాడల్లో నడుచుకుంటున్నా మన్నారు. 1999 చందానగర్‌లో తొలి అడుగు విజేత నేడు 25 సంవత్సరాల విజయోత్సవంలో 109 శాఖలు, విజేత పేరులో ఉన్న అర్థం ఎంతో గొప్పది. కస్టమర్లే దేవుళ్ళు అనే సూక్తిని నిత్యం జపిస్తూ 1999లో సూపర్ మార్కెట్ వ్యాపారంలోకి ఒక అడుగు వేసామన్నారు. మా కష్టాన్ని నిజం చేస్తూ నేడు 109 బ్రాంచీలతో విజేత సూపర్ మార్కెట్ ఒక బ్రాండుగా నిలిచి, రజతోత్సవాలు జరుపుకుంటుందన్నారు. ఈ సందర్భంగా కస్టమర్స్‌కు, డిస్ట్రిబ్యూటర్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కావాలనే మాసంస్థపై బురద జల్లె యత్నం

లక్ష్మీశ్రీనివాసకన్‌స్ట్రక్షన్స్

పార్లమెంటు సాధారణ ఎన్నికల కోడ్ అమల్లోకి

-లైసెన్స్ ఉన్న తుపాకులను పోలీసు స్టేషన్లలో 25 లోపు అప్పగించాలి : సీపీ అనురాధ

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :

పార్లమెంటు సాధారణ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున లైసెన్స్ ఉన్న తుపాకులను స్థానిక పోలీసు స్టేషన్లలో ఈనెల 25 లోపు అప్పగించాలని సీపీ డా॥అనురాధ సూచించారు. సోమవారం అమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ పూర్తికాగానే తిరిగి నిబంధనల ప్రకారం తీసుకొని వెళ్లవచ్చునని తెలిపారు. ఈనెల 25లోపు తుపాకులు డిపాజిట్ చేయని వారిపై కేంద్ర, రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ అదేశాల ప్రకారం తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎలక్షన్ కమిషన్ అదేశాలను ప్రజలు, ప్రజాప్రతినిధులు తూచా తప్పకుండా పాటించాలన్నారు. జిల్లాలో బార్డర్ పోలీసు స్టేషన్లలో 10 చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 24 గంటలు వాహనాలు తనిఖీ చేయడం జరుగుతుందన్నారు.

అకాల వర్షంతో రైతులకు అపార నష్టం

అకాల వర్షంతో రైతులకు అపార నష్టం

బెజ్జంకి, మార్చి 18, ప్రభాతవార్త :

మండలంలోని ఇటీవల కురిసిన అకాల వర్షం కారణంగా అయా గ్రామాల్లో చాలా వరకు పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అయా గ్రామాల్లో రైతులు ఎక్కువగా మొక్కజొన్న పంటను సాగు చేస్తుండగా ఇటీవల ఈదురు గాలులతో కూడిన వర్షం కారణంగా మొక్కజొన్న నేలకొరిగిందని, అలాగే గత కొద్ది రోజులు మంచుతో అంతంత మాత్రంగా ఉన్న మామిడి పూత వర్షం కారణంగా అంతంత మాత్రంగా కాసిన మామిడి కాయలు సగానికిపైగా నేల మట్టం అయ్యాయని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షంతో నష్టపోయిన పంటలను గుర్తించి ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించి రైతులను అదుకోవాలని కోరుతున్నారు.

డిఎం అండ్ హెచ్‌ను సత్కరించిన టిఆర్ఎంపి,పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

డిఎంఅండ్‌హెచ్ఓను సత్కరిస్తున్న అర్ఎంపి, పిఎంపిలు

సిద్దిపేట రూరల్, మార్చి 18, ప్రభాతవార్త:

సిద్దిపేట జిల్లా డిఎంఅండ్‌హెచ్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పుట్ల శ్రీనివాస్‌ను జిల్లా కలెక్టరేట్‌లోని కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అర్ఎంపి, పిఎంపి వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.బాల్‌రాజు, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు వైకుంఠం, సిద్దిపేట పట్టణ అధ్యక్షులు ముదిగొండ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు కుమార్‌లు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు.

క్రీడల వలన మానసిక ఉల్లాసం పెంపొందుతుంది

క్రీడకారులకు వాలీబాల్ కిట్టులను అందిస్తున్న దృశ్యం

బెజ్జంకి, మార్చి 18, ప్రభాతవార్త:

క్రీడల వలన మానసిక శారీరక ఉల్లాసం దృఢత్వం పెంపొందుతాయని డా॥మామిడి అనిల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని తన స్వంత గ్రామమైన వీరాపూర్ గ్రామంలో యువతకు డా॥అనిల్‌కుమార్‌రెడ్డి అధ్వర్యంలో ఉచితంగా వాలీబాల్ కిట్టులను అందజేశారు. అనంతరం అయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. క్రీడల వలన స్నేహ సంబందాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు మిట్టపల్లి చెన్నారెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, గ్రామ యువకులు పాల్గొన్నారు.

కులం మతం పేరుతో దేశంలో రాజకీయాలు చెల్లవు

-సిపిఎం కేంద్ర కమిటి సభ్యులు చెరుపల్లి సీతరాములు

సమావేశంలో మాట్లాతున్న చెరుపల్లి సీతరాములు

చేర్యాల,మార్చి 18, ప్రభాతవార్త

దేశంలో కులం, మతం పేరుతో ప్రజలను విభజించే రాజకీయాలు చెల్లవని సిపియం పార్టీ కేంద్ర కమిటి సభ్యులు చెరుపల్లి సీతరాములు అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో చేర్యాల, కొమురవెళ్ళి, మద్దూరు, దూల్మిట్ట సిపియం పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అధ్యక్షతన జరుగగా ముఖ్యతిథిలుగా సీతారాములు పాల్గొని మాట్లాడుతూ బీజేపి ప్రభుత్వం ఎలక్టోరల్ బాండ్ల రూపంలో వేలకోట్ల రూపాయలు కార్పొరేట్ శక్తుల నుండి అక్రమంగా పోగేసుకొని మళ్ళీ ఆ అవినీతి సొమ్ముతో గెలవాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, దేశ రక్షణ కోసం సమైక్యత, సమగ్రత కోసం పోరాడుతున్న ఏకైక పార్టీ సిపియం పార్టీ అని అన్నారు. భూమికోసం భుక్తికోసం పోరాడి ప్రాణ త్యాగాలు చేసిన పార్టీ భువనగిరి పార్లమెంట్ ఎన్నికల బరిలో ఉండబోతున్నట్లు అందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు గెలుపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపియం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కరాములు, ఆముదాల మల్లారెడ్డి, నక్కల యాదవరెడ్డి, రాళ్ళబండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, వెంకటమావో,ఆలేటి యాదగిరి, బండి నాగరాజు, రవికుమార్, బద్దిపడగ కృష్ణారెడ్డి, బండకింది అరుణ్ కుమార్, అత్తిని శారద, దాసరి ప్రశాంత్,తాడూరి రవీందర్,నాలుగు మండలాల శాఖ కార్యదర్శులు,కమిటి సభ్యులు,ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

బాలుర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కో-ఎడ్యుకేషన్ పునరుద్ధీకరణ

-ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం
-కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి

కళాశాల ప్రిన్సిపాల్‌కు పూల బొకే అందజేస్తున్న అధ్యాపక బృందం

గజ్వేల్, మార్చి 18 (ప్రభాతవార్త):

గజ్వేల్‌లోని బాలుర సముదాయంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1997లో కో-ఎడ్యుకేషన్‌తో ప్రారంభమై విజయవంతంగా నడుపబడుతుందని, కానీ 2018 విద్యా సంవత్సరం నుండి అత్యాధునిక మౌళిక వసతులతో కూడిన నూతన కళాశాల భవనాన్ని సంగాపూర్ వద్ద నిర్మించి కేవలం బాలుర అడ్మిషన్‌లకు మాత్రమే అనుమతిస్తూ బాలికల ప్రవేశానికి నిరాకరించడమైంది. ఈ కారణంగా కళాశాల అడ్మిషన్లు తగ్గుముఖం పట్టాయని, కళాశాలలో అనుభవం మరియు ఉన్నత విద్యార్హతలు కలిగిన అధ్యాపక బృందం, అధునాతన ప్రయోగశాల సౌకర్యాలు, లైబ్రరీ, జిమ్, హాస్టల్ సదుపాయాలు, విశాలమైన క్రీడా మైదానం, నాలుగు ఎన్ఎస్ఎస్ యూనిట్లు, ఒక ఎన్‌సిసి విభాగాలు ఉండి కళాశాల సదుపాయాలు నిర్వీర్యం అవుతున్న కారణంగా మరోసారి పునరాలోచించి కళాశాల ప్రణాళిక అభివృద్ధి కమిటీ, పట్టణ మరియు సమీప గ్రామాల ప్రజాప్రతినిధుల ప్రోత్సాహంతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం తెలంగాణ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ కృషి ఫలితంగా కళాశాల యొక్క విధానాన్ని కో-ఎడ్యుకేషన్ స్థితిగా పునరుద్ధరించారు. ఈ విధానం ద్వారా కళాశాలలో ఎన్‌సిసి సదుపాయాన్ని 33 శాతంగా బాలికలకు కూడా ఉండబోతుందని, ఈ సదవకాశాన్ని మరియు కళాశాల వసతులను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ భవాని తెలిపారు. కో-ఎడ్యుకేషన్ నిర్ణయాన్ని హర్షిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో కో-ఎడ్యుకేషన్‌కు సహకరించిన కళాశాల ఉన్నత విద్యా శాఖ కమిషనర్ బుర్ర వెంకటేశం, జాయింట్ డైరెక్టర్లు రాజేందర్‌సింగ్, యాదగిరి, ఏజిఓ బాల భాస్కర్, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ప్రొఫెసర్ కోదండరాంలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు

-పరీక్ష కేంద్రాల వద్ద పోలీసుల భారీ బందోబస్తు

పరీక్ష కేంద్రం వద్ద పోలీసులకు సూచనలు ఇస్తున్న ఏసిపి పురుషోత్తంరెడ్డి

గజ్వేల్, మార్చి 18 (ప్రభాతవార్త):

పదవ తరగతి పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం జరిగిన మొదటి పరీక్ష సందర్భంగా పోలీసులు పరీక్ష కేంద్రాల వద్ద భారీ బందోబస్తు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలుచేశారు. ఇదిలా ఉండగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా మరో రెండు జెడ్‌పిహెచ్ఎస్ రిమ్మనగూడ, జెడ్‌పిహెచ్ఎస్ అహ్మదీపూర్‌లో ఏర్పాటు చేశారు. మొత్తం 1530 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి వుండగా 1529 మంది పరీక్షలు రాసినట్లు ఒకరు గైర్హాజర్ అయినట్లు విద్యాధికారులు తెలిపారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఏసిపి పురుషోత్తంరెడ్డి

సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ ఆదేశాల మేరకు గజ్వేల్ పోలీస్ కమిషనర్ పురుషోత్తంరెడ్డి, గజ్వేల్ సిఐ సైదాలు సోమవారం పరీక్ష కేంద్రాలను, బాలుర, బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసిపి పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు పటిష్టంగా ఉండాలని సిఐ సైదాకు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడం జరిగిందని, పరీక్షలు జరిగే సమయంలో సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, పరీక్ష కేంద్రం నుండి 500 మీటర్ల వరకు ఐదుగురు అంతకు మించి ప్రజలు గుమికూడవద్దని, పరీక్షల నిర్వహణకు కట్టుధిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలని, మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా అధ్యాపకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పరస్పరంగా సహకరించుకుందాం

-ప్రశాంతంగా ఎన్నికలు జరుపుకుందాం
-రాష్ట్ర సరిహద్దులో పోలీసు అధికారుల సమావేశం

బీదర్ సరిహద్దు జిల్లా పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న పోలీసు అధికారి

జహీరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త:

రానున్న పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకునేందుకు ఒకిరికి ఒకరు సహకరించుకోవాల్సిన అవసరం ఉందని ఇరు రాష్ట్రాల పోలీసు అధికారులు అన్నారు. సోమవారం జహీరాబాద్ డిఎస్‌పి కే రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన పట్టణంలోని మహేంద్రా సమావేశ మందిరంలో నిర్వహించిన జహీరాబాద్ డివిజన్, బీదర్ జిల్లా పోలీసు అధికారుల నేర సమీక్ష సమావేశం నిర్వహించిన సమావేశానికి జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు, బీదర్ జిల్లా అదనపు ఎస్‌పి, డిఎస్‌పి, సిఐ,ఎస్ఐలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ పంజీవరావు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు, నేరస్తుల సమాచారం తెలుసుకునేందుకు ఇరు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల పోలీసుల సహకారం ఎంతో అవసరమని గుర్తు చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. సరిహద్దులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అక్రమంగా డబ్బు, మద్యం తరలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డివిజన్ పరిధిలోని అధికారులు పాల్గొన్నారు.

ఎంపివోపై ఎంపిపి దాడి అమానుషం...!

-ఎంపివోపై దాడి చేసిన ఎంపిపిపై కఠిన చర్యలు తీసుకోవాలి
-మండల పంచాయతీ అధికారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ సురేష్

మండల ప్రజాపరిషత్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

హుస్నాబాద్,మార్చి17,ప్రభాతవార్త

నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం ఎంపివోపై మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు దాడి చేయడం అమానుషం అని పంచాయతీ అధికారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ సురేష్ అన్నారు.ఇటీవల జరిగిన ఈ దాడిని నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం హుస్నాబాద్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో హుస్నాబాద్,అక్కన్నపేట ఎంపివోలు సత్యనారాయణ,కవికుమార్‌ల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వంలో ఉండే అన్ని శాఖల కంటే ఎక్కువ పంచాయతీ రాజ్ శాఖనే ప్రభుత్వం ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ గ్రామాలను అభివృద్ధి దిశలో నడిపిస్తుంటే అలాంటి శాఖలో పని చేసే అధికారిపైనే ఎంపిపి దాడి చేయడం సిగ్గుచేటాన్నరు.ఈ విషయంపై ప్రభుత్వం వెంటనే స్పందించి ఎంపివోపై దాడికి పాల్పడిన మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని డిమాండ్ చేశారు.

కిష్టాపూర్ కెనాల్‌కు నీటిని విడుదల చేయాలి

రాయపోల్,మార్చి18 ప్రభాతవార్త

కిష్టాపూర్ కెనాల్ ద్వారా పంట పొలాలకు నీటిని విడుదల చేయాలని వివిధ గ్రామాల రైతులు అధికారులను డిమాండ్ చేశారు.సోమవారం రాయపోల్ మండల పరిధిలోని వీరానగర్ గ్రామ శివారులో గల రామాయంపేట కెనాల్ వద్ద వీరారెడ్డిపల్లి తదితర గ్రామాల ప్రజలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రామాయంపేట కెనాల్ నుండి కిష్టాపూర్ కెనాల్‌కు నీటిని విడుదల చేయడానికి సులువుగా ఉండేందుకు కిష్టాపూర్‌కెనాల్‌ను దాదాపుగా మూడు కిలోమీటర్ల మేర పూడిక తీయమని అధికారులు చెప్పడంతో సుమారు 6 గ్రామాలరైతులు 6 లక్షల వరకు ఖర్చు చేసి మరమ్మత్తులు చేయించడం జరిగిందన్నారు.తీరా మరమ్మత్తులు పూర్తి అయినతరువాత అధికారులు నీటిని విడుదల చేయడం లేదని వాపోయారు.నీటిని విడుదల చేయకపోవడం వల్ల కిష్టాపూర్,గుండ్రెడ్డిపల్లి,మల్కాపూర్,కోనాయిపల్లి, వీరారెడ్డిపల్లి, దోడ్లపల్లి గ్రామాల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు.సుమారు వేల ఎకరాల పంట పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు.ఎమ్మెల్యేకు, అధికార పార్టీ దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కూడ విన్నవించిన ఎలాంటి ఫలితం లేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి కిష్టాపూర్ కెనాల్‌కు నీటిని విడుదల చేయాలని వేడుకున్నారు

కిష్టాపూర్ కెనాల్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

బీసీలకు మెదక్ పార్లమెంట్ టికెట్ ఇవ్వాలి

-బిసిల రాజకీయ ఎదుగుదలకు సహకరించాలి
-టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం

సిద్దిపేట రూరల్, మార్చి 18, ప్రభాతవార్త :

త్వరలో జరిగే సాధారణ పార్లమెంటు ఎన్నికల్లో మెదక్ పార్లమెంటు నుంచి తాను పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని లేదంటే కాంగ్రెస్ నుంచి రెబల్‌గా నైనా పోటీ చేస్తానని టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో అయన విలేకరులతో మాట్లాడారు.రాజకీయలలో కుమ్మరి కులానికి ప్రాధాన్యత లేనందున తమకు ప్రాధాన్యత ఇవ్వలని పార్టీ అధిష్టానికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పటి నుంచి పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని నియో జకవర్గంలో విజయవంతంగా పూర్తి చేస్తూ వచ్చానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అవకాశం కల్పిస్తే మెదక్ పార్లమెంటు నుంచి పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. పార్టీ అధిష్టానం అవకాశం ఇవ్వకుంటే రెబల్‌గా పోటీ చేస్తానని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు తన వంతు కృషి చేశానని తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర అధ్యక్షునిగా కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ వస్తున్నానని తెలిపారు. బీసీలలో రాజకీయంగా వెనకబడ్డ కుమ్మరి కులానికి టికెట్ ఇచ్చి రాజకీయ ఎదుగుదలకు సహకరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అరు గ్యారెంటీలతో ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 14కుపైగా స్థానాలు గెలుస్తుందన్నారు.

అక్రమ ఇసుక నిల్వలపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

ఇసుక రవాణా చేస్తున్న వాహనాన్ని సీజ్ చేసిన పోలీసులు

బెజ్జంకి, మార్చి 18, ప్రభాతవార్త :

అదివారం వేకజామున అక్రమంగా నిలువ చేసిన ఇసుకను తరలిస్తున్న టిప్పర్,జేసీబీని పట్టుకొని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు మండల పరిధిలోని గూడెం గ్రామానికి చెందిన గూడెల్లి శ్రీనివాస్ ఇసుకను అక్రమంగా నిల్వచేసి బేగంపేట గ్రామానికి చెందిన డి.కొమురయ్యకు చెందిన టిఎస్36హెచ్6057 నంబరు గల జేసీబీ సహయంతో సిద్దిపేటకు చెందిన వెన్నమనేని అర్జున్ టిఎస్23 టి9138 టిప్పర్ వాహనంలో అర్ధరాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్తానిక పోలీసుల సహాయంతో దాడి నిర్వహించి జేసీబీ, టిప్పర్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు మాట్లాడుతూ ఎలాంటి ప్రభుత్వం అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్ అక్రమంగా రవాణా చేసిన పేకాట అడిన, గంజాయి ఇతరత్రా మత్తు పదార్థాలను విక్రయించినా నిల్వ చేసిన చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వెంటనే సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ 8712667445 లేదా 8712667447, 8712667446కు సమాచారం అందించాలన్నారు.

రేషన్ బియ్యం కార్డుదారులకు సక్రమంగా సరఫరా చేయాలి

-రెవెన్యూ అధికారి కృష్ణ

రేషన్ దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్ఐ కృష్ణ

గజ్వేల్, మార్చి 18 (ప్రభాతవార్త):

రేషన్ బియ్యం కార్డుదారులకు సక్రమంగా సరఫరా చేయాలని గజ్వేల్ ఆర్ఐ కృష్ణ పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ ఆర్డీఓ బన్సిలాల్, తహసీల్దార్ శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు ప్రజ్ఞాపూర్‌లోని నాలుగు రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్ డీలర్లు రేషన్ కార్డుదారులకు తప్పనిసరిగా బియ్యం పంపిణీ చేయాలని, రేషన్ డీలర్లు అడ్డదారిన బియ్యం తరలిస్తున్నట్లు మాకు సమాచారం వచ్చిందని, అందులో భాగంగానే తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. ఎవరైనా రేషన్ డీలర్లు అక్రమంగా బియ్యం సరఫరా చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజ్ఞాపూర్‌లో నాలుగు రేషన్ దుకాణాలు ఉండగా అందులో వార్డు వారీగా దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని డీలర్లకు తెలిపినట్లు పేర్కొన్నారు.

ఆలయంలో ఘనంగా కొనసాగుతున్న ఉత్సవాలు

కొహేడ, మార్చి 18, ప్రభాతవార్త :

కొహేడ మండల పరిధిలోని తంగళ్లపల్లి గ్రామంలో ఉన్న రుక్మిణి సత్యభామ సమేత సంతాన శ్రీ వేణుగోపాలస్వామి అలయం ఎంతో పవిత్రమైన పుణ్య క్షేత్రం, రుక్మిణి సత్యభామ సమేత సంతాన శ్రీ వేణుగోపాలస్వామి ఇక్కడ దర్శనమిస్తాడు. అరు వందల యేండ్ల చరిత్ర ఉన్న ఈ అలయం అహ్లాదకరమైన వాతావరణంలో మోయ తుమ్మెద వాగు సమీపాన కృష్ణస్వామి గుట్టపై అలయం ఉండడం వలన ఎంతో ప్రత్యేకతను సంతరించుకుంది. అలయ సమీపంలో ఉన్న మోయ తుమ్మెద వాగు నీటిలో స్నానాలు అచరిస్తే సకల పాపాలు హరిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.ఈ అలయంలో స్వస్తిశ్రీ శుభ కృత నామ సంవత్సరం పాల్గుణ ఈనెల 16 నుంచి జగద్రక్షకుడైన రుక్మిణి సత్యభామ సమేత సంతాన శ్రీ వేణుగోపాల స్వామి నవాహ్నిక ఉత్సవాలు ప్రారంభమైనాయి. ఈ ఉత్సవాలు ఈనెల 26 వరకు కొనసాగుతాయి. ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని అలయ చైర్మన్, డైరెక్టరు, పూజారి, ఎంపిటిసి కోనే శేఖర్‌లు తెలిపారు.

జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్న కార్మికులు

సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

సిద్దిపేట రూరల్, మార్చి 18, ప్రభాతవార్త :

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ అసుపత్రిలో పని చేస్తున్న కార్మికులకు జీతాలు అందడం లేదని సోమవారం అసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్‌కు తెలంగాణ మెడికల్‌అండ్‌హెల్త్ ఔట్‌సోర్సింగ్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ బహుజన కార్మిక సంఘాల సమాఖ్య అధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దుర్గం శ్రీనివాస్, బహుజన కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర నాయకులు దబ్బేట అనంద్‌లు మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అసుపత్రిలో పని చేస్తున్న సానిటేషన్,సెక్యూరిటీ, పేషంట్ కేర్ ఉద్యోగులు 150 మందికిపైగా పని చేస్తున్నారని తెలిపారు. కార్మికులకు గత మూడు నెలల నుంచి జీతాలు రావడం లేదన్నారు. కార్మికులకు మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని లేదంటే అందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు.

అంగన్‌వాడీలో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

-చేర్యాల సిడిపిఓ శారదా

మాట్లాడుతున్న సిడిపిఓ శారదా

చేర్యాల,మార్చి 18, ప్రభాతవార్త

ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు అందించే పౌష్టికాహారాన్ని పిల్లలు, గర్భిణీలు, బాలింతలు సక్రమంగా సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని చేర్యాల సిడిపిఓ శారదా తెలిపారు. సోమవారం పట్టణంలో ఉన్న 9 అంగన్‌వాడీ కేంద్రాల టీచర్ల సమక్షంలో 1వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ పక్షోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యమంలో సిడిపిఓ శారదా, సూపర్వైజర్ నాగమణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ ఆహారం యొక్క ప్రాముక్యత వైవిధ్యంపై తల్లులకు తెలియజేయాలని అంగన్వాడీ టీచర్లకు సిడిపిఓ తెలియజేశారు. అంగన్వాడీ కేంద్రము పరివాహక ప్రాంతములోని పిల్లలందరి పెరుగుదలపై పర్యవేక్షన, గ్రోత్ మానిటరింగ్ చేయాలని సూచించారు. అనంతరం పోషన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పోషణ అభియాన్ టీం కనకరాజు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

మెదక్ బిజెపి ఎంపి అభ్యర్థిని కలిసిన నేతలు

బిజెపి ఎంపి అభ్యర్థి రఘునందన్‌రావుతో మర్కుక్ మండల నేతలు

మర్కుక్, మార్చి 18 (ప్రభాతవార్త):

మర్కుక్ మండల బిజెపి అధ్యక్షుడు సాయిరెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండల బిజెపి నాయకులు మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ బిజెపి అభ్యర్థి, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు సాయిరెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి రఘునందన్‌రావు విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బిజెపి అభ్యర్థి గెలుపు కోసం గ్రామాల్లో కార్యకర్తలందరం ఐక్యమత్యంతో కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ మండల అధ్యక్షుడు రమేష్, నాయకులు పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎఫ్‌డిసి చైర్మన్ గిరధర్‌రెడ్డి

మంత్రిని సన్మానించిన చైర్మన్ గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త: ఎఫ్‌డిసి చైర్మన్‌గా నియామకం అయిన జహీరాబాద్ ఎంపిపి అధ్యక్షులు గిరిధర్‌రెడ్డి సోమవారం రాష్ట్ర రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మాత్యులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. చైర్మన్‌గా నియమించి నందుకు కృతజ్ఞతగా మంత్రి పూలబొకేనే అందించి శాలువాతో సత్కరించారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసానికి గిరిధర్‌రెడ్డి చేరుకుని కృతజ్ఞతలు తెలుపుకున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గిరిధర్‌రెడ్డికి ఆల్ ద బెస్ట్ చెప్పి శుభాకాంక్షలు అందించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

అల్లాదుర్గం, మార్చి 18, ప్రభాతవార్త: ఈ నెల 19వ తేదీన ఎంపిపి అధ్యక్షులు అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు మండల అభివృద్ధి అధికారి శంకర్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం అయ్యే సమావేశానికి ఆయా శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించి పూర్తి నివేదికలతో హాజరు కావాలన్నారు. మండల సభ్యులు సమావేశానికి సకాలంలో హాజరై సభను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ శంకర్ సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొల్చారం, మార్చి 18 ప్రభాతవార్త: మండల పరిధిలోని కొల్చారంతో పాటు అంసానిపల్లి, పోతంశెట్టిపల్లి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లలో మంగళవారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ లైన్‌మెన్ సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌడిపల్లి నుండి ఈ మూడు సబ్‌స్టేషన్లకు వచ్చే విద్యుత్ లైన్ వెంట చెట్ల కొమ్మలను నరికివేస్తున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినయోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

మండలంలో భారీ వడగళ్ల వాన

వడగళ్ల వాన దృశ్యం

నిజాంపేట, మార్చి 18, ప్రభాతవార్త : మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో సోమవారం సాయంత్రం కురిసిన వడగళ్ల వానకి పంటలు దెబ్బతిన్నాయి. మామిడి కాయలు దెబ్బతిన్నాయి.

ఎన్నికలను సజావుగా నిర్వహించుకుందాం : ఆర్డీవో

ఎన్నికల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఓ ఎస్ రాజు

జహీరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త: రానున్న పార్లమెంట్ ఎన్నికలు సజావుగా ముగిసేలా అధికారులు తగు వంతు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆర్‌డిఓ ఎస్ రాజు సూచించారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల తహసీల్దార్‌లతో ప్రత్యేకంగా సమావేశమై తగు సూచనలు, సలహాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ రాజు మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ ఆదేశాలకు అనుగుణంగా అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున రాజకీయ పార్టీలనే నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో ఆయా మండలాల తహసీల్దార్‌లు పాల్గొని తమ సమస్యలను నివృతి చేసుకున్నారు.

నేడు రైతులతో మాట్లాడనున్న వ్యవసాయ విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలు : ఎవో శ్వేతకుమారి

కొల్చారం, మార్చి 18 ప్రభాతవార్త: రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతువేదికల నుండి రైతులతో వ్యవసాయ విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలు నేడు ఉదయం 10 గంటలకు మాట్లాడతారని మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వరిసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వివిధ యాజమాన్య పద్ధతుల గురించి డాక్టర్ బి.శ్రీనివాస్ ప్లాంట్ బ్రీడింగ్ శాస్త్రవేత్త ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం జగిత్యాల వారు రైతులకు వివరిస్తారన్నారు. అనంతరం రైతుల సందేహాలను తీర్చడం జరుగుతుందన్నారు. తరువాత ఆయిల్‌ఫామ్ సాగులో తీసుకోవాల్సిన మెలకువల గురించి డాక్టర్ రాజశేఖర్ డీన్ ఆఫన అగ్రికల్చర్ శ్రీకొండా లక్ష్మణ్‌బాపూజీ ఉద్యానవన విశ్వవిద్యాలయం వారు వివరించడంతో పాటు రైతుల సందేహాలను తీర్చడం జరుగుతుందన్నారు. వేసవిలో వివిధ కూరగాయ పంటల్లోవాడే పురుగు మందుల వివరాల గురించి డాక్టర్ కవిత ప్రిన్సిపాల్ సైంటిస్ట్ ఎంటమాలజీ వారు వివరిస్తారని తెలిపారు. చివరగా ప్రతి మంగళవారం నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులకు క్షేత్రస్థాయిలో అవసరమయ్యే వీడియో కాన్ఫరెన్స్ టాపిక్‌ల గురించి చర్చించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని వివిధ పంటలకు సంబంధించి సాగు పద్ధతులను నేర్చుకోవాల్సిందిగా రైతులకు సూచించారు.

ఇన్‌చార్జి ఎంపిడివోపై దాడి..హేయమైన చర్య

కొల్చారం, మార్చి 18 ప్రభాతవార్త: నాగర్ కర్నూల్ జిల్లా కోడూరు ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రావణ్‌పై దాడిచేసిన ఎంపీపీ రాధపై చర్యలు తీసుకొని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కొల్చారం ఎంపీడీవో లక్ష్మీనర్సింలు అన్నారు. సోమవారం కొల్చారం మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చచేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కోడెరు ఇంచార్జి ఎంపీడీవో శ్రావణ్‌పై ఎంపీపీ రాధ అకారణంగా చెప్పుతో కొట్టారని ఎంపీడీవో లక్ష్మీనర్సింలు తెలిపారు. కోడెరు ఘటనను నిరసిస్తూ కొల్చారం మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లక్ష్మీనర్సింలు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎంపీపీ రాధపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అంజయ్య, శ్రీనివాసులు, మహేష్, పోచయ్య, నాగరత్నం, రాజేందర్, స్వాతిప్రియ, మమత, సంధ్య, అరుంధతి, విఠల్, ఫణీంద్ర, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

గుమ్మడిదల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ గంగాభవాని

వెల్దుర్తిలో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

నిజాంపేట పరీక్ష కేంద్రం

ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు

మనూర్ పరీక్ష కేంద్రం వద్ద పోలీసులకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ వెంకటస్వామి

మనూర్, మార్చి 18, ప్రభాతవార్త: మండలంలోని ఆయా గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతిలో విద్యను ఆర్జించిన 246 మంది విద్యార్థులు సోమవారం వార్షిక పరీక్షలకు హాజరై ప్రశాంతంగా పరీక్షలు రాశారు. మనూర్ ఉన్నత పాఠశాలలో విద్యను ఆర్జించిన 227 మంది విద్యార్థులు, రాయిపల్లి పాఠశాలలో 19 మంది దేవనూర్ పరీక్షా కేంద్రంలో పరీక్షలు రాసినట్లు ఎంఈఓ శ్రీనివాస్, కో-ఆర్డినేటర్ సంతోష్‌కుమార్ జోషి తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ వెంకటస్వామి పరశీలించి పోలీసులకు పలు సూచనలు, సలహాలు అందచేశారు. ఎస్ఐ అంబ్రెయ్య అధ్వర్యంలో పోలీసు సిబ్బంది పరీక్ష కేంద్రాల వద్ద నిఘా ఏర్పాటు చేశారు.

నాగల్‌గిద్దలో...

నాగల్‌గిద్ద, మార్చి 18, ప్రభాతవార్త: 10వ తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రశాంతగా ప్రారంభం అయ్యాయి. నాగల్‌గిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో 243మంది విద్యార్థులు విద్యను అందుకుని అందరు పరీక్షలకు హాజరై పరీక్షలు రాసినట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రమేష్, డిపార్ట్‌మెంట్ అధికారి రవీందర్ తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ సిద్దిరాములు పేర్కొన్నారు.

గుమ్మడిదలలో...

గుమ్మడిదల, మార్చి18 ప్రభాతవార్త: పదవ తరగతి విద్యార్థులకు 2023-24 సంవత్సరానికి గాను పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ విషయమై గుమ్మడిదల మండలంలోని ఆయా పదవ తరగతి పరీక్ష కేంద్రాలను సోమవారం తహశీల్దార్ గంగాభవాని, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులకు విద్యార్థుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను, వేసవి కాలంలో కావాల్సిన సదుపాయలను సమకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షలు బాగా రాసి ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొల్చారంలో...

కొల్చారం, మార్చి18 ప్రభాతవార్త: మండలంలోని పరీక్ష కేంద్రాల్లో సోమవారం జరిగిన పదవ తరగతి మొదటి పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు మండల విద్యాధికారి నీలకంఠం ఒక ప్రకటనలో తెలిపారు. కొల్చారంలోని సెంటర్ ఏలో 192 మందికి 192 మంది విద్యార్థులు, సెంటర్ బీలో 124 మందికి 124 మంది విద్యార్థులు, రంగంపేటలోని సెంటర్‌ఏలో 190 మందికి 190 విద్యార్థులు, సెంటర్ బీలో 80 మంది విద్యార్థులకు 80 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాసినట్లు వివరించారు. మొత్తం 586 మంది విద్యార్థులకు గాను 586 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాసినట్లు ఆయన తెలిపారు.

వెల్దుర్తిలో...

వెల్దుర్తి, మార్చి18 ప్రభాతవార్త: మండల కేంద్రంలో సోమవారం నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకొని వారి వారి హాల్‌టికెట్లను సరిచూసుకొని పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లారు. వెళ్లేముందు సిబ్బంది వారిని పూర్తిగా చెక్ చేశారు. ఎలాంటి మాల్ ప్రాక్టిసింగ్‌కు పాల్పడకుండా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారు. పదవ తరగతి మొదటి పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

నిజాంపేటలో...

నిజాంపేట, మార్చి 18, ప్రభాతవార్త : రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు సోమవారం నుండి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతగా ముగిసింది. ఉదయం 9 గంటలలోపే వారి తల్లిదండ్రులతో ఎగ్జామ్స్ సెంటర్ వద్ద సందడి నెలకొంది. ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు జరిగినట్లు పరీక్షా అధికారి అబ్దుల్ రషీద్, సిఎస్ దేవరాజు గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయని, పరీక్ష కేంద్రాల వద్ద ఇద్దరు వైద్యులు, పదిమంది ఇన్విజిలేటర్లు, ఒకరు సిఎస్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నామన్నారు. మండల వ్యాప్తంగా ఏడు పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు ఇంగ్లీష్ మీడియం 106, తెలుగు మీడియం 69, మొత్తం 175 మంది విద్యార్థిని, విద్యార్థులు హాజరయ్యారని, ఒక్కరూ గైర్హాజర్ కాలేదన్నారు. పరీక్ష కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తహశీల్దార్ ఆదేశానుసారం 144 సెక్షన్ పోలీస్ భద్రత కల్పించామన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ఇన్విజిలేటర్లు తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేటలో...

శివ్వంపేట, మార్చి18 ప్రభాతవార్త: మండలంలో సోమవారం ప్రారంభమైన పదవతరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయి. శివ్వంపేట, చంది, గోమారం, దొంతి ఉన్నత పాఠశాలల్లో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి కె. బుచ్చానాయక్ మీడియాకు తెలిపారు. పదవ తరగతి పరీక్షకు 499 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. అందులో 260 మంది బాలికలు, 230 మంది బాలురు హాజరయ్యారని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆదేశానుసారం పకడ్బంధీగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. అనుమతి లేకుండా పరీక్ష కేంద్రంలోకి ఎవరిని కూడా రానివ్వమని ఆయన స్పష్టం చేశారు.

బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలి

జహీరాబాద్ బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్

పెద్దశంకరంపేట, మార్చి 18 ప్రభాతవార్త: కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జహీరాబాద్ బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ అన్నారు. సోమవారం నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ 10 సంవత్సరాల పదవికాలంలో ప్రజలను పట్టించుకోలేదని, అధికారాన్ని అడ్డుపెట్టుకొని కంగ్టి మండలంలోని పేద రైతుల భూములను స్వాధీనం చేసుకున్నారని విమర్శించారు. బీబీ పాటిల్ నారాయణఖేడ్‌ను అభివృద్ధి చేయడం మరిచి ఇక్కడి భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ అధికారంలో ఉన్నప్పుడు దేవాలయాల భూములను వదలకుండా స్వాహా చేశారని ఆరోపించారు. తప్పుడు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, 15వేలకు రైతు బంధు పెంచుతామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాలుగు ఎకరాల రైతులకు కూడా ఇప్పటి వరకు డబ్బులు వేయలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి పూటకో మాట మారుస్తూ కాలం వెళ్ల దీస్తున్నారన్నారు. నారాయణఖేడ్ అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలోనే జరిగిందని స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే నారాయణఖేడ్ ప్రాంతంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని ఈ సందర్భంగా గాలి అనిల్‌కుమార్ హామీ ఇచ్చారు. అంతకుముందు మండల పరిధలోని ఆరెపల్లి గ్రామంలో జరిగిన బీరప్ప జాతరలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మురళిపంతులు, ఎంపీటీసీ దత్తు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు లక్ష్మీ రమేష్, నాయకులు వెంకట్‌రెడ్డి, సురేష్‌గౌడ్, శంకరయ్య, కుంట్ల రాములు, యాదుల్ హుస్సేన్, మాణిక్ రెడ్డి, గంగారం తదితరులు పాల్గొన్నారు.

చెట్లను నరికేసిన దృశ్యం

హరితహారం చెట్లను నరికేస్తున్న విద్యుత్ అధికారులు

పెద్దశంకరంపేట, మార్చి 18 ప్రభాతవార్త: గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాలలో హరితహారం ఒకటి. ఈ కార్యక్రమంలో భాగంగా అప్పుడు నాటిన చెట్లు ఏపుగా పెరిగాయి. పెరిగిన చెట్లను చూసి ప్రకృతిని ఆస్వాదించేలోపే అధికారులు అడ్డంగా నరికిస్తున్నారు. వివరాల్లోకి వెళితే పెద్దశంకరంపేటలో మల్కాపూర్ వెళ్లేరహదారిలో ఇరువైపులా అధికారులు గతంలో మొక్కలు నాటారు. అవి ఏపుగా పెరిగి వృక్షాలుగా మారాయి. దీంతో రోడ్డుకు ఇరువైపులా హరితవనాలతో అహ్లాదకరమైన వాతావరణంతో ప్రయాణికులకు చెట్లు కనువిందు చేస్తున్నాయి. అయితే ఈ పచ్చదనాన్ని ప్రయాణికులు ఆస్వాదించేలోపే విద్యుత్ అధికారులు వాటిని నరికేస్తున్నారు. మల్కాపూర్ వెళ్లేదారితోపాటు పెద్దశంకరంపేటలో మరికొన్ని చోట్ల విద్యుత్ తీగలకు చెట్లు అడ్డుపడుతుండటంతో వాటిని నరికేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. దీంతో అధికారుల తీరుపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పదవి ముదిరాజులకు కేటాయించాలి

హుస్నాబాద్, మార్చి 17, ప్రభాతవార్త : రాష్ట్ర ఫిషరీస్ చైర్మెన్ పదవి ముదిరాజ్‌లకే కేటాయించాలని ముదిరాజ్ మహాసభ హుస్నాబాద్ అధ్యక్షులు పొన్నబోయిన శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 37 కార్పొరేషన్‌లను నియమించ డాన్ని స్వాగతిస్తున్నామని, కానీ ముదిరాజ్‌ల విషయంలో అన్యాయం చేయాలని చూస్తుందన్నారు. ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్‌గా అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్‌లకు ఇవ్వకుండా గంగపుత్రులు అయిన మెట్ట సాయి కుమార్‌కు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో ముదిరాజ్ జాతికి సంబంధించి మత్స్యకార సొసైటీలు దాదాపు 6వేల పైచిలుకు ఉన్నాయని తమకు కాదని కనీసం 10శాతం లేని గంగపుత్రులకు ఎలా ఇస్తారని ప్రభు త్వాన్ని ప్రశ్నించారు. ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచించి ముదిరాజ్‌లకే చైర్మెన్ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

చలివేంద్రం ప్రారంభం

సిద్దిపేట అర్బన్, మార్చి 18, ప్రభాతవార్త : వాసవీక్లబ్స్ జోన్ చైర్మన్ పర్యటనలో భాగంగా వాసవీయూత్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పుల్లూరి శివకుమార్ సహకారంతో శుభోదయ పాఠశాలలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. పాత వెంకటేశ్వర్ల దేవాలయం, అన్నపూర్ణేశ్వరి దేవాలయం వద్ద సిమెంట్ బెంచ్‌లను ఏర్పాటు చేశారు.స్థానిక వైశ్య భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పది మంది పేదలకు పది కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జోన్ చైర్మన్లు చింత రాజేంద్రప్రసాద్, తొడుపునూరి కృష్ణవేణి మాట్లాడుతూ సిద్దిపేట వాసవీ యూత్ క్లబ్ అధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ ప్రతినిధులు చలం రవి, అరవపల్లి హరి కిరణ్, గంప కృష్ణమూర్తి, పుల్లూరి శివకుమార్, జైన సత్యం, తోట విశ్వం,సోమా దుర్గయ్య, బుక్క శివ,తోటమని శ్రీనివాస్, మల్లికార్జున్,నల్ల రవి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మ వెంకన్నకు ఘన నివాళులు

హుస్నాబాద్, మార్చి 17, ప్రభాతవార్త : ప్రస్తుతం హుస్నాబాద్‌లో పేరొందిన గొప్ప నాయకులంతా దివంగత నేత, మాజీ శాసనసభ్యులు బొమ్మ వెంకన్న శిష్యులేనని టిపిసిసి సభ్యులు కేడం లింగమూర్తి అన్నారు. సోమవారం ఆయన వర్ధంతి వేడుకలను పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో వివిధ పార్టీల నాయకులు, ఆయన అభిమానులతోకలసి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.బొమ్మ వెంకన్న శాసనసభ్యులుగా ఉన్న కాలంలోనే ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించాలని గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టుల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపిన విషయాన్ని గుర్తు చేశారు. హుస్నాబాద్‌కు బస్‌డిపో, డిగ్రీ కళాశాల, మార్కెట్ యార్డు లాంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఆయన హయాంలోనే వచ్చాయన్నారు. అధికారంలో ఉన్నా లేకపోయినా అన్ని పార్టీల వారితో ఆయన స్నేహపూర్వకంగా ఉండేవారన్నారు.బొమ్మ వెంకన్న ఆశయాలను స్ఫూర్తిగా తీసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ గౌరవెల్లి,గండిపల్లి ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు హుస్నాబాద్‌కు మెడికల్ కళాశాల తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు.ఈకార్యక్రమంలో సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య,మున్సిపల్ కౌన్సిలర్లు భూక్య సరోజన,వల్లపు రాజు,పున్న లావన్య సది,మాజీ ఎంపిపి ఆకుల వెంకన్న,కాంగ్రెస్ సీనియర్ నాయకులు బూరుగు కిష్టస్వామి,వెన్న రాజు,ఎండి హస్సన్,అక్కు శ్రీనివాస్,మైదంశెట్టి వీరన్న, వివిధ పార్టీల నాయకులు అయిలేని మల్లిఖార్జునరెడ్డి, కవ్వ వేణుగోపాల్‌రెడ్డి, పోలోజు రవిందర్,మాడిశెట్టి శ్రీధర్,సాంబారి బాబు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మ వెంకన్న చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

విద్యార్థులను తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

హుస్నాబాద్‌లో పది పరీక్షలు ప్రారంభం

హుస్నాబాద్, మార్చి 17, ప్రభాతవార్త : రాష్ట్రంలో ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు హుస్నాబాద్ పట్టణంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి పరీక్ష కేంద్రాల వద్ద పహారా కాసారు. ఇందుకోసం విధించిన 144 సెక్షన్‌ను ఎస్ఐ తోట మహేష్ సిబ్బందితో పకడ్బంధీగా అమలు చేసి పరీక్ష కేంద్రాల వద్దకు ఇతరులను ప్రవేశించకుండా పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు.హుస్నాబాద్‌లో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా 822 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది. పట్టణంలో ఏర్పాటు చేసిన బాలుర ఉన్నత పాఠశాలలో 164 మంది రాయాల్సి ఉండగా 164 మంది హాజరుకాగా బాలికల ఉన్నత పాఠశాలలో 198 మందికి 198 మంది, మోడల్(ఆదర్శ పాఠశాలలో 200 మందికి 200 మంది, జిల్లలగడ్డలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో 260 మందికి 260మంది విద్యార్థులు 100శాతం హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి దేశిరెడ్డి తెలిపారు.

పదవ తరగతి పరీక్షలకు ఇద్దరు గైర్హాజర్

ములుగు, మార్చి 18 (ప్రభాతవార్త): పదవ తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభం కాగా ప్రశాంతంగా జరిగినట్లు మండల విద్యాధికారి ఉదయ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ములుగు మండలంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా ములుగులో 242, తునికిబొల్లారంలో 145 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా సింగన్నగూడలో 192 మందికి గానూ 190 మంది హాజరైనట్లు తెలిపారు.

మృతి చెందిన ఆవు

పిడుగు పాటుకు పాడి ఆవు మృతి

హుస్నాబాద్(కోహెడ),మార్చి17,ప్రభాతవార్త : పిడుగు పాటుకు పాడి ఆవు మృతి చెందిన సంఘటన కోహెడమండలం సమద్రాల గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయి.సముద్రాల గ్రామానికి చెందిన పాడి రైతు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి పొలం వద్ద కట్టివేసిన ఆవు రాత్రి కిరిసన వర్షంలో పిడుగుపడి మృతి చెందడంతో దాదాపు 80వేల రూపాయల నష్టం వాటిల్లడంతో పాటు వారు ఉపాధి కోల్పోయినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఈవిషయంపై సంబందిత అధికారులు పరిశీలించి విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక పంపి నష్టపోయిన వారి కుటుంబాన్ని ఆదుకోవాలని బాదిత రైతు శ్రీనివాస్‌రెడ్డివేడుకుంటున్నారు.

ముస్లాపూర్‌లో ఘనంగా బీరప్ప జాతర ఉత్సవాలు

నేత్ర పర్వంగా బీరప్ప, కామరతి కళ్యాణోత్సవం

అల్లాదుర్గం, మార్చి 18, ప్రభాతవార్త: మండలంలోని ముస్లాపూర్ గ్రామంలో బీరప్ప జాతర ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నారు. సోమవారం బీరప్పస్వామి దేవాలయంలో బీరప్ప, కామరతి కళ్యాణోత్సవాన్ని నేత్ర పర్వంగా జరుపుకున్నారు. గొల్లకురుమల సంఘం ఆధ్వర్యంలోజరిగిన జాతర వేడుకలకు గ్రామంతోపాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి మహిళలు అమ్మవారికి గంగాబోనాలను ఊరేగింపుగా ఒగ్గుకళాకారుల నృత్యాల మధ్య తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. గొల్లబీర్లచే దప్పుచప్పుళ్లతో దేవాలయం చుట్టూ బోనాలతో గోవిందా గోవింద అంటూ స్మరిస్తూ ప్రదక్షిణలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు అన్నదానం కల్పించారు.

ముస్లాపూర్‌లో బీరప్ప, కామరతి కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

బోనాలను ఊరేగింపుగా తీసుకుపోతున్న మహిళా మణులు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక